క్లుప్తంగా

చెక్కుల పంపిణీ



మంగపేట: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ అనుబంధ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు, మండల ఇన్‌చార్జ్ గుమ్మడి సోమయ్య లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సీతక్క ఆదేశాల మేరకు పంపిణీ చేసినట్లు తెలిపారు. మండలంలోని రమణక్కపేటకు చెందిన చదలవాడ అఖిల్‌కుమార్‌కు రూ.52,500 వెంకటనర్సమ్మకు రూ.17,000, కొత్తపేటకు చెందిన కస్ప పాపయ్యకు రూ.11,500, దోమెడ గ్రామానికి చెందిన మహ్మద్ అఫ్జల్‌కు రూ.24,000, తిమ్మంపేటకు చెందిన రామక్కకు రూ 10,500ల విలువ గల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పూజారి సురేందర్, మండల ప్రధాన కార్యదర్శి కారుపోతుల నర్సయ్యగౌడ్, బీసీసెల్ జిల్లా నాయకులు నర్సింహారావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నర్రా కిశోర్, వెంకటేశ్వర్లు, ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు చాద మల్లయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు ముత్తినేని ఆదినారాయణ, మండల సీనియర్ నాయకులు అయ్యోరి యానయ్య, తూడి భగవాన్‌రెడ్డి, కొమరం బాలయ్య, ముకుందం, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సమగ్రాభివృద్ధి

శాయంపేట : బీజేపీతోనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని మాందారిపేట గ్రామంలో ఉపాధ్యక్షుడు మోత్కూరి సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన మండల స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా కీర్తిరెడ్డి హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడమే కాకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం లక్షల కోట్ల రూపాయలు కేటాయిస్తోందని తెలిపారు. ప్రధానిగా మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈనెల 30 నుంచి నెల రోజుల పాటు తలపెట్టిన కార్యక్రమాలను విజయవంతం చేయాలని శ్రేణులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. తద్వారా రాష్ట్రంలోనూ రానున్న ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకొస్తే తెలంగాణ అన్ని రంగాల్లోనూ సంపూర్ణ అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు.

అందని ద్రాక్షలా ఇంటర్, డిగ్రీ విద్య

- మండలంలో లేని కళాశాలలు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



మొగుళ్లపల్లి: మండలంలోని విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. పెద్ద చదువులు చదువుకోవాలని తపన ఉన్న ఇంటర్, డిగ్రీ కళాశాలలు అందుబాటులో లేక దూరం వెళ్లి చదువుకోలేక మధ్యలోనే చదువులకు స్వస్తి చెపుతున్నారు. మండలంలో ప్రతీ సంవత్సరం 300 మందికి పైగా పదో తరగతి పూర్తి చేస్తున్నారు. ఆర్థికంగా వెనుకబడిన పేద పిల్లలకు ఉన్నత విద్య అందని ద్రాక్షలా మారింది. ప్రభుత్వ కళాశాలలో ఇంటర్, డిగ్రీ చదవాలంటే పరకాల, జమ్మికుంట, హనుమకొండ పట్టణాలకు వెళ్లి చదువుకోవాలి లేదంటే మధ్యలోనే మానేయాలి. మండలంలో 25 గ్రామ పంచాయతీలు ఉన్నా ప్రభుత్వ కళాశాలలు లేకపోవడం దారుణమని స్థానికులు వాపోతున్నారు. విద్యార్థులు కొంత మంది పట్టణాలకు వెళ్తున్న బాలికలను దూర ప్రాంతాలకు పంపించడానికి తల్లిదండ్రులు ఇష్టపడడంలేదు. దీంతో బాలికలు ఇంటికే పరిమితమవుతున్నారు. ప్రభుత్వ కళాశాలను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కొర్కిశాల గ్రామంలో గల మోడల్‌స్కూల్ ఇంటర్ వరకు మాత్రమే ఉంది. మిగిలిన వారు పైచదువులకు వెళ్లాలంటే ప్రవేట్ కళాశాలలే దిక్కు. దీంతో నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవలేక ఇళ్ల వద్దనే కాలం వెళ్లదీస్తున్నారు.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు

మండల కేంద్రంలో ప్రభుత్వ, ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేస్తే తమ కష్టాలు తీరుతాయని విద్యార్థులు వాపోతున్నారు. ఈ విషయంపై అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం శూన్యమని విద్యార్థి సంఘాల నాయకులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా స్పందించి మండల కేంద్రంలో ఇంటర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

కళాశాలలు ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలో ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ ప్రభుత్వ కళాశాలలను ఏర్పాటు చేయాలి. పేద విద్యార్థులు పైచదువులకు వెళ్లాలంటే ప్రవేట్ కళాశాలలే దిక్కు అవుతున్నాయి. పేదవారిపై ఆర్థికంగా భారం పడుతుంది. దీంతో నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవలేక ఇళ్ల వద్దనే కాలం వెళ్లదీస్తున్నారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి మండల కేంద్రంలో ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేయాలి.

-రవీందర్‌రెడ్డి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్

కాంగ్రెస్‌ను విమర్శించడం సరికాదు



మాట్లాడుతున్న కోటగిరి సతీష్‌గౌడ్

టేకుమట్ల: కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అదే పార్టీని విమర్శించడం సరికాదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శనివారం మండలంలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే కాంగ్రెస్‌ను విమర్శించడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. స్వప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పార్టీలో చేరి ఉద్యమకారులను అవమానాలకు గురి చేస్తూ, పైశాచిక ఆనందం పొందుతున్నారని ఎద్దేవ చేశారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో, రాష్ట్రంలో ప్రతిపక్ష పాత్ర పోషించడంలో విఫలమైందంటూ ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ భూపాలపల్లిలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఇప్పటికైనా అసత్య ఆరోపణలు మానుకోవాలని, లేని పక్షంలో నియోజకవర్గ ప్రజలు ఓటుతో తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైనాల రవిందర్, బండ శ్రీకాంత్, నాంపెల్లి వీరేశం, బొల్లికొండ చిన్న రాజయ్య, శాస్త్రాల కిరణ్, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్రవ్యాప్త మహాసభలు

పరకాల : ఎస్సీ వర్గీకరణకు పార్లమెంటులో చట్టబద్ధత సాధించడం కోసం జూన్ 3 నుంచి 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఉమ్మడి జిల్లాల్లో మహాసభలు నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్, ఎంఎస్పీ వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంద కుమార్ తెలిపారు. పట్టణంలోని అమరధామంలో మహాసభల కరపత్రాలను ఆదివారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత సాధన కోసం సుదీర్ఘకాలంగా నడుస్తున్న ఉద్యమం కీలక దశకు చేరుకుందని చెప్పారు. జూన్ 4న హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న పార్టీ వరంగల్ ఉమ్మడి జిల్లా బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మొగుళ్లపల్లి: మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987–88 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చదువు నేర్పి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు వెంకటమల్లు, తిరుపతాచారి, మోహన్‌రావు, నర్సింసింహారెడ్డి, సాంబయ్య, నాగరాజు ఉపాధ్యాయులను శాలువాలు కప్పి మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. గతంలోని జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ.. పాత తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థి చందుపట్ల రఘోత్తంరెడ్డి తండ్రి మహేందర్ జ్ఞాపకార్థం పాఠశాలకు రూ.5 లక్షలు అందించనున్నట్లు తెలిపాడు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మోటె ధర్మారావు, ప్రధానోపాధ్యాయులు సామల రమేష్, పూర్వ విద్యార్థులు చిలుకమారి శ్రీనివాస్, బాపురావు, గడ్డం రవీందర్, సారయ్య, సదాశివుడు, మృత్యుంజయ, గంగిశెట్టి శ్రీనివాస్, అశోక్‌రావు, శ్రావన్‌కుమార్, శారవ, జ్యోతి, సువర్ణ, పద్మతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

మహాముత్తారం: మండలకేంద్రంలో పీఏసీఎస్ కార్యాలయంలో 80 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి సతీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30కిలోల బస్తాకు రూ.847 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల రైతులు ఆధార్ కార్డు, పట్టాపాస్ పుస్తకంతో గ్రామ సమీపంలోని రైతువేదికలో ఉన్న ఏఈఓను కలిసి వారివద్ద రాయించుకోవాలని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



పలిమెల: గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అరుణ్



కాటారం: మాట్లాడుతున్న ఎస్సై తమాషారెడ్డి

పలిమెల: సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన అవసరమని పలిమెల ఎస్సై అరుణ్ అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా ఆదివారం మండలంలోని బొడాయిగూడెంలో గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై అరుణ్ మాట్లాడుతూ.. ఓటీపీలు, పాస్‌వర్డ్‌లను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైన బాధితులు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఇటీవల కాలంలో మొబైల్ ఫోన్స్ మిస్సింగ్ కేసులు పెరిగిపోవడంతో సీఈఐఆర్ పోర్టల్‌పై అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురైతే టోల్ ఫ్రీ నెంబర్ 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం గ్రామంలో కల్వర్ట్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు బానిసకావొద్దు

కాటారం: యువత చెడు చెడు వ్యసనాలకు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్సై–2 తమాషారెడ్డి సూచించారు. మండలంలోని దేవరాంపల్లి, ధన్వాడ క్రాస్ వద్ద ఆదివారం పోలీస్ కమ్యూనిటింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. గ్రామాల్లో అసాంఘీక కార్యక్రమాలు, అసాంఘిక శక్తులకు చోటువ్వొద్దని తెలిపారు. యువత గంజాయి, డ్రగ్స్, ఆన్‌లైన్ గేమింగ్‌లకు దూరంగా ఉండాలని తెలిపారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.



కల్వర్టులను తనిఖీ చేస్తున్న ఎస్సై అరుణ్

నియామకం



మహేష్, అధ్యక్షుడు



నాగ రమేశ్, ప్రధాన కార్యదర్శి

ములుగు: బీఆర్ఎస్ పార్టీ యువజన జిల్లా అధక్ష్య, ప్రధాన కార్యదర్శులుగా కొగిల మహేష్, బాడిష నాగరమేష్‌ను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ ఆదివారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువజన విభాగం బలోపేతానికి తమ వంతుగా కృషి చేస్తామని తెలిపారు. నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

18న ఆన్‌లైన్ క్విజ్ పోటీలు

ఎస్ఎస్ తాడ్వాయి: రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌ను జూన్ 18న నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క ఆదేశాల మేరకు విద్యార్థులు, నిరుద్యోగ యువతి, యువకులకు ఈ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 17 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. 16 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు, నిరుద్యోగులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఈ పోటీల్లో ఉత్తీర్ణత సాధించిన ప్రథమ బహుమతి ల్యాప్‌టాప్, ద్వితీయ బహుమతి స్మార్ట్ ఫోన్, తృతీయ బహుమతిగా ట్యాబ్‌లను అందజేయనున్నట్లు వివరించారు. రిజిస్ట్రేషన్ కోసం 7661899899 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని మండలంలోని నిరుద్యోగ యువతి, యువకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్‌లో అంతర్గత పోరు!

టేకుమట్ల: బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత పోరు రోజు రోజుకు పెరిగిపోతుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం మండల కేంద్రంలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి వర్గీయులు హాజరు కాకపోవడంతో విమర్శలకు మరింత బలం చేకూరింది. అంతే కాకుండా బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు కత్తి సంపత్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ నర్సిరెడ్డితో ఆత్మీయ సమ్మేళనానికి తమకు బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, జిల్లా అధ్యక్షుల నుంచి ఎలాంటి ఆహ్వానం లేదని, ఎమ్మెల్సీ సిరికొండతో ఉండడమే కారణమా?, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నుంచి కూడా కనీసం ఎలాంటి సమాచారం లేదు అంటూ ఫోన్‌లో మాట్లాడిన సంభాషన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఇప్పటి వరకు చాపకింద నీరులా ఉన్న అంతర్గత పోరు ప్రస్తుతం బహిర్గతం కావడంతో రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి పూర్తి స్థాయిలో నష్టం కలుగుతుందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ పార్టీ జిల్లా యంత్రాంగం స్పందించి సిరికొండ, గండ్ర వర్గాలను ఏకం చేయాలని లేకుంటే ఓటమి తప్పదని పలువురు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



నూతనంగా నిర్మించిన శ్రీ సంతోషిమాత ఆలయం

మంగపేట: మండలంలోని బోరునర్సాపురంలో నూతనంగా నిర్మించిన శ్రీ సంతోషిమాత దేవాలయంలో విగ్రహ, యంత్ర ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సంతోషిమాత దేవాలయంతో పాటు ఉప ఆలయమైన సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, యంత్ర, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. సామర్లకోట చీమలకొండ లక్ష్మీనారాయణ శర్మ నేతృత్వంలో మొదటి రోజు సోమవారం దాతలచే గణపతిపూజ, ప్రతిష్ఠ సంకల్పం, పంచగవ్య ప్రాశన, దీక్షా ధారణ, యాగశాల ప్రవేశం, వాస్తు చతుష్టి, క్షేత్ర పాలక నవగ్రహ బ్రహ్మమంతక పూజలు, అఖండ దీపస్థాపన, సాయంత్రం వేద స్వస్తి అగ్ని మదనం, అంకురార్పన, ధవజారోహణ, మూత మంత్ర హోమాలు, క్షీరాధివాసం, జలాదివాసం, నీరాజన మంత్రపుష్పాలు, బలిహరణ, ప్రసాద వితరణ, తీర్థ వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు విగ్రహ ఆవిష్కరణ

ములుగు రూరల్: మండలంలోని మహ్మద్‌గౌస్‌పల్లి శివారులో శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ఆవిష్కరణ నేడు (సోమవారం) నిర్వహించనున్నట్లు ప్రతిష్ఠాపన కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహ్మద్‌గౌస్‌పల్లి శివారులో సహాద్రి క్రషర్స్‌కు వెళ్లేదారిలో 48 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు, హనుమాన్ భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపాకటాక్షాలు పొందాలని కోరారు.

చెరువులు కబ్జా!

- శిఖం భూములను ఆక్రమించుకుంటున్న వైనం
- పట్టా భూముల పేరుతో రైతుబంధు స్వాహా
- పట్టించుకోని అధికారులు



కబ్జాకు గురైన ఉప్పలనర్సయ్య చెరువు శిఖం

మంగపేట: మండలంలోని చెరువులను కబ్జా కోరులు మింగేస్తున్నారని ఆయా చెరువుల ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం చుట్టు ఉన్నటు వంటి ఈదులకుంట, గొల్లకుంట, వెంకన్నకుంట మూడు చెరువులు పూర్తిగా కనుమరుగు కావడంతో వాటికి సంబంధించిన చెరువుల శిఖం, చెరువుల భూములు పూర్తిగా కబ్జాకు గురయ్యాయి. అలాగే మంగపేట ఊరచెరువుకు సంబంధించిన శిఖం భూమి కొంత మేర కబ్జాకు అయినట్లు స్థానికులు వాపోతున్నారు. మండల కేంద్రంలోని చెరువుల పరిస్థితి ఇలా ఉందంటే మండల వ్యాప్తంగా ఉన్న చెరువుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. చెరుపల్లి రెవెన్యూ పరిధిలోని కోతులకుంట చెరువు కనీసం ఆనవాల్లు లేకపోవడం గమనార్హం. కమలాపురంలోని రచెరువు, కవ్వాలకుంట చెరువు కబ్జాకు గురికాగా మరో చెరువులోని శిఖం భూములను కబ్జా రాయుళ్లు సాగు భూములుగా మార్చుకుని ఆయా భూములకు పట్టాలు కూడా పొందినట్లు సమాచారం. బోరునర్సాపురంలోని మామిడికుంట, ఉప్పలనర్సయ్య చెరువు, చెరుపల్లిపెద్ద చెరువు, రెడ్డిచెరువు, తిమ్మంపేట తిమ్మచెరువు, కోడలుచెరువు, మల్లూరులోని అత్తచెరువు, చింతకుంట చెరువు, రాజుపేట ఊరచెరువు, పెరకల కుంట ఊరచెరువు ఇలా ఎక్కడ చూసినా వందల ఎకరాల మేర చెరువుల శిఖం భూములు కబ్జాకు గురయినట్లు గ్రామస్తులు తెలుపుతున్నారు. ఆయా చెరువుల శిఖం, భూములను కబ్జాచేసి సాగు చేసిన అక్రమార్కులు సాగుచేసిన పంటలు మునగకుండా చెరువుల తూముల షట్టర్లు తెరిచి నీటిని వెల్లగొడుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఇలాగే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చెరువుల ఆయకట్టు భూముల పరిస్థితి ప్రశ్నార్థంగా మారుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శిఖం భూములకు పట్టాలు!

చెరువుల శిఖం భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ అధికారులు అక్రమ సంపాదనకు అలువాటు పడి కబ్జాదారుల నుంచి రూ.లక్షల్లో లంచాలు తీసుకుని అక్రమంగా పట్టాలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. అదే అక్రమ పట్టాలతో బ్యాంకుల్లో రుణాలు పొందుతూ, ప్రభుత్వం ఇస్తున్న రైతుబంధు డబ్బులు కూడా పొందుతున్నారని ఆరోపిస్తున్నారు. మండల వ్యాప్తంగా 133 చెరువులు, కుంటలు ఉన్నట్లు అధికారులు చెపుతున్నా ఆయా చెరువులు, కుంటల పరిస్థితి ఇదే విధంగా ఉందని ఆయకట్టు రైతులు పేర్కొటున్నారు. శిఖం భూములను కబ్జా చేసిన వారిపై గతంలో రెవెన్యూ అధికారులకు ఆయా చెరువుల ఆయకట్టు రైతులు ఫిర్యాదు చేయడంతో కంటి తుడుపు చర్యలు తీసుకుని వదిలేయడం గమనార్హం. భూ కబ్జా రాయుళ్లలో ఎక్కువగా రాజకీయ పలుకుబడి, ధనవంతులు కావడంతో రెవెన్యూ అధికారులు వారిపై చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

హద్దుల ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యం

చెరువుల శిఖం భూములకు హద్దులు ఏర్పాటు చేయడంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెరువుల ఆయకట్టు రైతులు వాపోతున్నారు. మండలంలోని అన్ని చెరువులలో సర్వే చేసి శిఖం భూముల హద్దులను గుర్తించి ట్రెంచ్ కొట్టించి హద్దులు ఏర్పాటు చేయాలని గత ఏడాది క్రితం కలెక్టర్ ఆదేశించినా ఇంత వరకు ఎలాంటి పురోగతి లేకపోవడంతో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. హద్దులు ఏర్పాటు చేస్తే శిఖం భూములకు పట్టా చేసిన రెవెన్యూ అధికారుల అవినీతి బాగోతం ఎక్కడ బయట పడుతుందోనని రెవెన్యూ అధికారులు సర్వే చేయకుండా వదిలేశారని రైతులు ఆరోపిస్తున్నారు.

పట్టించుకోవడం లేదు



మండలంలోని మల్లూరు రెవెన్యూ పరిధిలోని అత్తచెరువు, జంగంచెరువు, తిమ్మంపేట రెవెన్యూ పరిధిలోని కోడలుచెరువు, చెరువుల శిఖం భూములు కొందరు కబ్జాచేసి డోజర్ ట్రాక్టర్లతో చదును చేసి సాగు భూములుగా మార్చుతున్నారు. దీంతో చెరువుల్లో నీరు నిల్వ ఉండక పోవడంతో తమ ఆయకట్టు భూములకు సాగు నీరు అందక ఎండి పోతున్నాయి. ఈ తహసీల్దార్‌కు ఆయకట్టు రైతులతో కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాం. వెంటనే సర్వే చేసి శిఖం భూములకు హద్దులు ఏర్పాటు చేసి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదు.

- తాటి విజయబాబు, పెసా మొబిలైజర్, మల్లూరు

హద్దులు ఏర్పాటు చేస్తాం..



మల్లూరు అత్తచెరువు, తిమ్మంపేట కోడలు చేరువు శిఖం భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని రైతులు ఫిర్యాదు చేసింది వాస్తవమే. ఇరిగేషన్ అధికారులతో జాయింట్ సర్వే నిర్వహించేందుకు తేదీ కూడా నిర్ణయించాం. ఆరోజు సర్వేయర్ స్థానికంగా పోవడంతో సర్వే నిలిచి పోయింది. వారం రోజుల్లో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తాం.

- శ్రీనివాసులు తహసీల్దార్, మంగపేట

సమస్యలు పరిష్కరించాలని వినతి



రవీందర్‌కు వినతిపత్రం ఇస్తున్న గోపాలమిత్రలు

ములుగు: తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా గోపాలమిత్ర సంఘం సభ్యులు శనివారం రాత్రి కరింనగర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ చెలమడ రాజేశ్వర్ రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు మారబోయిన రవీందర్ మాట్లాడుతూ గోపాలమిత్రలను పశు సంవర్ధక శాఖలో శాశ్వత ప్రతిపాదికన వేతనాలు అందించేలా సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్రలు లక్ష్మీనారాయణ, మధు, చారి, సాంశివరావు, నర్సింహా, సుమన్, సత్యనారాయణ, మహేశ్ ఉన్నారు.